ముంపు వీడినా.. నష్టాల ముప్పే..

- మండలంలో వరి పొలాల పరిస్థితి
- ముంపు బారిన 938 హెక్టార్లు
- నష్టాన్ని అంచనా వేస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి వరదతో నీట మునిగిన వరిచేలు ముంపు నుంచి బయటపడినప్పటికీ రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే వ్యవసాయాధికారులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారు. అలాగే గ్రామస్థాయి కమిటీలతో వరి పొలాల నష్టాలను అంచనా వేస్తున్నారు. ఇటీవల గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాతేరు గోదావరి గట్టు వద్ద జల్లకాలువ గేటు నుంచి ఆపై నుంచి వచ్చే నీరు వెనక్కిరావడంతో తొర్రేడు, వెంకటనగరం, కాతేరు, కోలమూరు గ్రామాల్లోని వరి పొలాలు నీటమునిగాయి. మోకాళ్లలోతు నీటితో వరిచేలు నిండిపోయాయి. దీంతో నాట్లు నీటమునిగాయి. అలాగే ధవళేశ్వరం సాయబాబాగుడి వద్ద గోదావరి గేట్లు మూసివేయడంతో రాజమహేంద్రవరం నగరం నుంచి వచ్చే నీరు వెనక్కిరావడంతో ధవళేశ్వరం, హుకుంపేట గ్రామంలో వరిపొలాలు ముంపు బారిన పడ్డాయి.



తొర్రేడులో నీటమునిగిన వరి పొలాలను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేస్తున్న సిబ్బంది

నీరు లాగినా..

వరిపొలాల్లో నీరు ప్రస్తుతం లాగింది. వారం రోజులకు పైగా వరినాట్లు వరదనీటిలో ఉన్నాయి. రూరల్ మండలంలో 938 హెక్టార్లలో ముంపుబారిన పడ్డాయి. రైతులు ఒక్కో ఎకరానికి రూ.8 వేల నుంచి రూ.12 వేలు వరకు ఖర్చు చేశారు. నీట మునిగిన వరిపొలాలను వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఏ రైతు నష్టపోకుండా నష్టపరిహారం అంచనా వేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌వో, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు కమిటీగా ఏర్పాటి పంటనష్టం అంచనా వేస్తున్నారు. అనంతరం ఈ నివేదికను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. ఆ తర్వాత ఉన్నతాధికారులకు నివేదిస్తారు.

గ్రామం	మునిగిన వరి (హెక్టార్లలో)
తొర్రేడు	480
కాతేరు, వెంకటనగరం	295
కోలమూరు	150
దవళేశ్వరం	7.5
హుకుంపేట	5.5
మొత్తం	938

అంచనా వేస్తున్నాం



వరద కారణంగా నీటమునిగిన వరిపొలాల పంటనష్టం అంచనా వేస్తున్నాం. అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలకు పరిహారం చెల్లించడం జరుగుతుంది.

– అడపా భీమరాజు, వ్యవసాయాధికారి, రాజమహేంద్రవరం రూరల్

ప్రజల సహకారం మరువలేనిది

- ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి
- కడియం స్టేషన్ ఆవరణలో షటిల్ కోర్టు ప్రారంభం

కడియం: శాంతి భద్రతల పరిరక్షణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసుల సహకారం మరువలేనిదని ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి అన్నారు. కడియం పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన షటిల్ కోర్టును మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి సతీ సమేతంగా హాజరైన ఎస్పీ స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తామంతా పనిచేస్తామన్నారు. జిల్లాలో సమర్థులైన అధికారులు ఎందరో ఉన్నారన్నారు. వారందరి సహకారంతో తాను విజయవంతంగా పనిచేయగలిగానని ఎస్పీ వివరించారు. అంతకు ముందు వేదాశీర్వచనంతో ఎస్పీ దంపతులకు పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. కొద్దిసేపు షటిల్ ఆడారు. షటిల్ కోర్టుతో పాటు, నూతనంగా నిర్మించిన రిసెప్షన్ కౌంటర్‌ను కూడా సుధీర్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దిన ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్‌ను అభినందించారు. కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి దంపతులు

స్వనిధి రుణాలతో వ్యాపారాభివృద్ధి



సక్రమంగా రుణాలు చెల్లించిన వారిని సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ప్రధానమంత్రి స్వనిధి పేరుతో బ్యాంకులు అందిస్తున్న రుణాలను చిరు వ్యాపారులు తమ వ్యాపారాభివృద్ధి కోసం వినియోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపు నిచ్చారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం ప్రధానమంత్రి స్వనిధి రుణాలపై అవగాహన సదస్సు, లక్ష్యాలను సాధించిన వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరితగతిన రుణాలను చెల్లిస్తే, మళ్లీ అధిక మొత్తంలో తిరిగి రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. బ్యాంకులు వద్ద పెండింగులో ఉన్న అన్ని రుణాలను వీలైనంత తొందరగా విడుదల చేయాలన్నారు. కాగా.. ఈ స్కీమ్‌లో రుణాలు తీసుకుని సక్రమంగా తిరిగి చెల్లించిన చిరువ్యాపారులకు కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా సత్కారం నిర్వహించారు. మొదటి విడత రూ.10 వేలు తీసుకుని, తిరిగి సక్రమంగా చెల్లించిన వారికి 2వ విడతగా రూ.20 వేలు, అలాగే రెండో విడత లోన్ సక్రమంగా చెల్లించిన వారికి మూడో విడతలో రూ.50 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ రుణాలను సక్రమంగా చెల్లిస్తున్న వారికి 7 శాతం వరకు వడ్డీ రాయితీ వారి ఖాతాకు జమ అవుతుందన్నారు. గూగుల్ పే, ఫోన్ పే, భారత్ పే లాంటి ప్లాట్‌ఫాం వాడుతూ డిజిటల్ లావాదేవీలు చేస్తున్నట్లయితే వారికి కాష్ బ్యాక్‌లు కూడా వస్తాయన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం కృష్ణయ్య , స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం మిశ్రా, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డీబీ ప్రసాద్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్ర యోధుల త్యాగాలు చిరస్మరణీయం



స్వాతంత్య్ర సమరయోధుల వారసులను సత్కరిస్తున్న రాజబాబు తదితరులు

సీటీఆర్ఐ: స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయమని కళాగౌతమి వ్యవస్థాపకుడు డాక్టర్ బీబీఎస్ మూర్తి అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధుల వారసులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎబెల్ రాజబాబు చేతుల మీదుగా సన్మానించారు. స్వాతంత్ర సమరయోధులైన గుజ్జు వెంకట్రావు, నాగరత్నం పుత్రుడు విశ్వేశ్వరరావు, పాలకోడేటి గురుమూర్తి మనవడు డాక్టర్ పాలకోడేటి గురుమూర్తి, ఏబీ నాగేశ్వరరావు కుమారుడు ఏ.కృష్ణ దత్తాత్రేయశర్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డీవీ రమణమూర్తి, జి.శరత్‌బాబు, డాక్టర్ పీవీబీ సంజీవరావు, అధ్యాపకులు డాక్టర్ వై.స్వర్ణశ్రీ, ఎం.లలితారమ్య, డి.మధులత, కె.శాంతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కడియం: మండల కేంద్రమైన కడియం గ్రామానికి చెందిన బీడీ మల్లేశ్వరరావు (24) సోమవారం పురుగుల మందు తాగి కడియం పంప్‌హౌస్ సమీపంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతడిని గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో తొలుత కడియం, ఆ తరువాత రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశాడు. మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదును అనుసరించి కడియం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమ విఫలం కావడంతోనే పురుగుల మందు తాగినట్టు పోలీసులు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

రాజానగరం: మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ లారీని వేగంగా నడిపి రోడ్డు పక్కన ఆగివున్న మరో లారీని ఢీకొన్నాడు. దివాన్ చెరువు పండ్ల మార్కెట్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన స్థానికులు తెలిపిన వివరాలిలావున్నాయి. గామన్ బ్రిడ్జి వైపు నుంచి రాజానగరం వైపు వెళ్తున్న లారీ దివాన్ చెరువు పండ్ల మార్కెట్ వద్దకు వచ్చే సరికి రోడ్డు పక్కన ఉన్న మరో లారీని ఢీకొంది. ఈ ఘటనలో ఆ లారీ క్లీనర్ వైపు భాగం నుజ్జునుజ్జయ్యింది. అయితే ఆ లారీలో క్లీనర్ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆగిఉన్న లారీ వెనుక భాగం కూడా కొంతవరకు దెబ్బతిన్నా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదు. ఈ మేరకు బొమ్మూరు పోలీసులకు సమాచారం అందించారు.



ప్రమాదానికి కారణమైన లారీ

ప్రమాదకరంగా కేబుల్ స్తంభం



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలకసంస్థ పరిధి 16వ డివిజన్ ఆవ రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కల్వర్టు వద్ద ఇనుప కేబుల్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. స్తంభం పూర్తిగా బయటకు వచ్చేసి, తీగల ఆధారంతో నిలబడి ఉంది. ప్రమాదవశాత్తూ అది పడిపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని సామాజికవేత్త ఆకుల జగదీష్ కోరుతున్నారు.

12, 13 తేదీల్లో క్రీడా పోటీలు

ప్రకాశం నగర్: ఈశా గ్రామోత్సవంలో భాగంగా ఈనెల 12, 13 తేదీల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జిల్లాస్థాయిలో పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రో బాల్ పోటీలు నిర్వహించనున్నట్టు ఈశా వలంటీర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశా రేజువెనేషన్ ట్రోఫీ 2023లో భాగంగా ఈ పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఆట ఆడేలా ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆటల వినోదాన్ని తిరిగి తీసుకువచ్చి, అంతరించిపోతున్న సంప్రదాయాలను పునరుద్ధరించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు కోయంబత్తూర్ లోని ఈశా యోగా సెంటర్‌లో జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 83000 30999 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాజానగరం పీహెచ్‌సీ సందర్శన

రాజానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) కేంద్ర గణాంకాల అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. ఆస్పత్రిలో కేంద్ర ప్రభుత్వ పరంగా అమలవుతున్న పథకాలు, రోగులకు అందిస్తున్న సేవలు, ముఖ్యంగా జననీ సురక్ష యోజన పథకం అమలు తీరును రికార్డులతో సహా క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న లబ్ధిదారులను కూడా ప్రశ్నించారు. అనంతరం చక్రద్వారబంధంలోని హెల్త్ క్లినిక్‌ను సందర్శించి, పని తీరును పరిశీలించారు. టి.రామారావు, రాఘవేంద్రతో కూడిన కేంద్ర బృందం వెంట డీపీఎంఓ డాక్టర్ అభిషేక్, జిల్లా ఎన్‌సీడీ కో ఆర్డినేటర్ సుదీర్, డాక్టర్ టి.రవికుమార్ ఉన్నారు.



రాజానగరం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

నన్నయలో ఎంపీఈడీ కోర్సు



ఎంపీఈడీ కోర్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) కోర్సును తక్కువ ఫీజులతో అందిస్తున్నామని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఈ కోర్సు బ్రోచర్‌ను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎంపీఈడీ కోర్సు తమ వర్సిటీలో మాత్రమే ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాస్ఫూర్తి ఉన్న విద్యార్థులకు అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈ కోర్సు ప్రారంభించామన్నారు. ఏపీ పీజీ సెట్‌లో అర్హత పొందిన విద్యార్థులు కూడా దీనిలో చేరవచ్చన్నారు. ఈ కోర్సు చేసే విద్యార్థుల కోసం వర్సిటీ క్యాంపస్‌లో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, బాస్కెట్‌బాల్ కోర్టులు, వాలీబాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించి సదుపాయాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2022–23లో ఉపాధి హామీ పథకం పనులపై చర్చించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ పి.జగదాంబ, అంబుడ్స్‌మెన్ జ్యోతి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 1,020 పనులకుగాను అంచనా విలువ రూ.8.43 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. దీనిపై ఆడిట్ నిర్వహించి, దానికి సంబంధించిన తనిఖీ నివేదికను ప్రజావేదికలో ఎస్ఆర్పీలు, డీఆర్పీలు సమర్పించారు. ఎమ్ బుక్ కొలతలు లెక్కకట్టడంతో తప్పులు జరగడంతో టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.500 జరిమానా విధించారు. ఆడిట్ రికార్డుపై డ్వామా పీడీ జగదాంబ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రమేష్, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, ఏపీవో కె.నాగ శేషవేణి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సినిమాలు



శ్యామల	:	మెగ్–2
సూర్యమినీ	:	సూర్య సన్ ఆఫ్ కృష్ణన్
సూర్యప్యాలెస్	:	మెగ్–2
స్వామి	:	బ్రో
శివజ్యోతి	:	బిజినెస్‌మెన్
అనుశ్రీ	:	బ్రో
అశోక	:	ఎల్‌జీఎం–లెట్స్‌గెట్‌మ్యారీడ్
ఊర్వశి	:	బ్లడ్‌అండ్‌చాక్లెట్, హెబ్బులి
రంభ	:	రాజుగారికోడిపలావు
మేనక	:	కృష్ణగాడు అంటే ఒక రేంజ్, ప్రియమైన ప్రియ
అప్సర	:	బేబి
రాజా	:	బిజినెస్‌మెన్
నామవరం		
వీఎస్.మహల్	:	బ్రో
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	బిజినెస్‌మెన్
కడియం		
వెంకటసూర్య	:	బ్రో

క్లుప్తంగా

వంతెన నిర్మాణం చేపట్టాలి



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చందన రమేష్, చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: పొట్టిలంక కాలువపై వంతెన నిర్మాణం త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ కోరారు. రాజమహేంద్రవరం విచ్చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చందన నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్యే చందన రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రూరల్ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. వాటిపై సీఎం సానుకూలంగా స్పందించారన్నారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం



జాతీయ జెండాను చూపుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ కోమల్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాలలో జాతీయ జెండాల విక్రయాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ మేరకు పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ ప్రకటన విడుదల చేశారు. జాతీయ జెండాను రూ.25కు విక్రయిస్తున్నామని, కావాల్సిన వారు తమ సమీప పోస్టాఫీసులలో కొనుగోలు చేయవచ్చన్నారు. పెద్ద సంఖ్యలో జెండాలు కావాల్సిన వారు ప్రజాసంబంధాల అధికారి పీవీ సుబ్బయ్యను 70135 95065 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

లోక్ అదాలత్‌పై సమావేశం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: జిల్లాలో వచ్చేనెల తొమ్మిదో తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి పలు ఇన్సూరెన్స్ కంపెనీలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సమావేశం నిర్వహించారు. న్యాయస్థానం ఆవరణలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంపై చర్చించారు. మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసుల పరిష్కారానికి సంబంధించి పిటీషనర్లు, ఇన్సూరెన్స్ సంస్థల అధికారులు, ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య సమన్వయం కుదిర్చేలా చర్చలు జరిగాయి. ఎక్కువ మొత్తంలో కేసులు పరిష్కారమయ్యేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, అధికారులు పాల్గొన్నారు.

కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి



డీఆర్‌ఓ నరసింహులుకు వినతిపత్రం అందిస్తున్న నాయీ బ్రాహ్మణులు

సీటీఆర్ఐ: నాయీ బ్రాహ్మణులను కించపరిచేలా ప్రవర్తించిన అతిరాజ నారాయణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాయీ బ్రాహ్మణ సంఘీయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్‌ఓ నరసింహులకు మంగళవారం వినతి పత్రం అందించారు. తారకరామా నగర్‌లో ప్రజలపై రౌడీయిజం చేస్తున్న నారాయణపై బొమ్మూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. విచారణలో భాగంగా కానిస్టేబుల్ ఫిర్యాదు దారుల వివరాలు సేకరిస్తున్న సమయంలో నారాయణ బెదిరింపునకు పాల్పడుతూ, ఫిర్యాదుదారుల్లో ఒకరైన కందికొండ రమేష్ కులంపై హేళనగా మాట్లాడాడన్నారు. దీనిపై కలెక్టర్ విచారణ జరిపి, కులదూషణపై చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కందికొండ అప్పారావు, ఇనపకుర్తి ఈశ్వరావు, రాలి సత్తిరాజు, కందికొండ అనంతరావు ఉన్నారు.

చందన నాగేశ్వర్ పరామర్శ

రాజమహేంద్రవరం రూరల్: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బొమ్మూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తోడేటి రాజాను మంగళవారం సాయంత్రం ఏపీజీ అండ్ బీసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, ఎలుగొండ చెల్లాయమ్మ, మత్సేటి శివ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కన్నమాంబ తల్లి జాతర



చందన నాగేశ్వర్‌కు అమ్మవారి ఫొటో అందజేస్తున్న జాతర కమిటీ సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట వద్ద శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో కన్నమాంబ తల్లి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఈ జాతరకు వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ గౌడ, శెట్టిబలిజ సంఘాల కార్పొరేషన్ చైర్మన్ పాలిక శ్రీను, వార్డు ఇన్‌చార్జి సబ్బెళ్ల విజయ దుర్గారెడ్డి, జాతర కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

నదిలో దూకి వ్యక్తి గల్లంతు!

కొవ్వూరు: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామానికి చెందిన గంగన శ్రీనివాస్ అనే వ్యక్తి గోదావరి నదిలో దూకి గల్లంతయ్యాడని పోలీసులు భావిస్తున్నారు. అతడి మోటార్ సైకిల్, పాదరక్షలు గామన్ ఇండియా బ్రిడ్జిపై 56వ స్తంభం వద్ద సోమవారం రాత్రి లభ్యం కావడమే వారి అనుమానానికి కారణం. ఆ వస్తువులను పెట్రోలింగ్ పోలీసులు గుర్తించి కొవ్వూరు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ మానసిక స్థితి సక్రమంగా ఉండడం లేదని అతడి బావ మరిది ఉండవల్లి శ్రీహరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారని పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలిపారు. కాగా శ్రీనివాస్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

వ్యక్తిపై దాడి

ధవళేశ్వరం: అప్పు తీర్చాలని అడిగిన వ్యక్తిపై ముగ్గురు దాడి చేసి కులం పేరుతో దూషించారు. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధవళేశ్వరానికి చెందిన గడ అబ్బులు గ్రామానికే చెందిన కర్రి సాయిరావు, కర్రి మంగ, కర్రి ప్రమీలకు గతంలో రూ.5 లక్షలు అప్పు ఇచ్చాడు. తిరిగి తీర్చాలని అడగడంతో సోమవారం రాత్రి 11.35 గంటల సమయంలో అబ్బులను ధవళేశ్వరం సంత మార్కెట్ వద్దకు తీసుకువచ్చారు. అతడి బట్టలు విప్పి, విద్యుత్ స్తంభానికి కట్టి కులం పేరుతో దూషిస్తూ కాళ్లతో తన్నుతూ గాయపరిచారు. బాధితుడు అబ్బులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.